అరబ్బీ అల్లుడు!

వాణిశ్రీ

ఆ గదిలో ఇంకా లైటు వెలుగుతూ వుంది.

అక్బర్ చిరాకుగా బీడీ వెలిగించి గట్టిగా దమ్ము పీల్చాడు.

అప్పటికి రాత్రి పది దాటింది.

స్ట్రీట్ లైట్లు అక్కడక్కడా గుడ్డిగా వెలుగుతున్నాయి.

రోడ్డు మీద జనసంచారమే లేదు. చలిగాలి రివ్వున వీస్తోంది. అప్పుడే మంచు తెరలు తెరలుగా కురవడం ఆరంభమైంది.

అక్బర్ రోడ్డుప్రక్కనున్న చింతచెట్టు కొమ్మలో కూర్చుని వున్నాడు అరగంటనుంచీ. అతని దృష్టి అంతా ఎదురుగావున్న ఆ పాత భవనంపైనే వుంది.

ఆ గదిలో లైటు ఆరిపోగానే తను సిద్ధంగా వుండాలి. ఆ ముసలాడు పడుకున్న పదినిముషాలకే గుర్రుపెట్టి నిద్రపోతాడు.

'బద్మాష్ ముండాకొడుకుని ఒక్క పోటుతో అల్లా దగ్గరికి పంపాలి' అనుకున్నాడు అక్బర్ కసిగా.

అక్బర్ వూహించినట్లే కాసేపటికి ఆ గదిలో లైటు ఆరిపోయింది.

అరగంట తర్వాత అక్బర్ నెమ్మదిగా చెట్టుదిగి ప్రహరిగోడ ఎక్కి లోపలకు దూకాడు.

ఒక్కొక్క అడుగు వేస్తూ, ఎవరైనా తనను గమనిస్తున్నారేమోనని వెనక్కి తిరిగి చూస్తూ ఆ భవనం దగ్గరికి చేరుకున్నాడు.

కొన్ని నెలలుగా అక్బర్ కి ఆ భవనం బాగా పరిచయమే. ఆ ముసలాడు లోపల గడివేసుకున్నా లోపలకు ఎలా ప్రవేశించాలో బాగా తెలుసు. అందుకు ప్లాన్ సిద్ధం చేసుకునే వచ్చాడు.

దక్షిణం వైపువున్న గదికి అద్దాల కిటికీ వుంది. దానికి లోపల ఇనుప వూచలు లేవు. బోల్టులు పెట్టివుంటాయి. బోల్టుదగ్గర పగలకొట్టి చేతితో లోపల బోల్టుతీయవచ్చు. ఇక ఆ గదిలో ప్రవేశిస్తే ఇంట్లో ఎక్కడికైనా నిరాటంకంగా వెళ్ళిపోవచ్చు.

అక్బర్ దక్షిణం వైపువున్న గది దగ్గర నిల్చున్నాడు. అంతా చీకటి. ఆ చుట్టుప్రక్కల ఇళ్ళల్లోకూడా ఎక్కడా అలికిడిలేదు.

అక్బర్ చుట్టూ పరిశీలనగా చూసి చిన్నరాతితో అద్దాన్ని గట్టిగా కొట్టాడు. గాజుముక్కలు గలగలలాడాయి నేలమీద పడి.

గాజుముక్కలు పడిన శబ్దానికి ఆ ముసలాడు లేచి వస్తాడేమోనని అక్బర్ ఒక జిల్లేడుచెట్టు మొదట్లో నక్కాడు.

పావుగంట గడిచినా లోపల చడీ చప్పుడూ లేదు.

అక్బర్ కి ధైర్యం వచ్చింది.

ఆ బద్మాష్ లేవలేదన్నమాట అనుకున్నాడు.

కిటికీ బోల్టుతీసి బార్లా తెరిచాడు. ఒక్క వూపులో ఎగిరి లోపలపడ్డాడు. బూటుక్రింద గాజు పెంకులు కర కరా నలిగాయి. లోపలకు వెళ్ళగానే కిటికీ తలుపులు పెట్టేశాడు.

జేబులోనుంచి పెన్ టార్చితో దారి చూసుకుంటూ ఆ ముసలాడు పడుకున్న గదిలోకి ప్రవేశించాడు.

ఒకమూల స్టూల్ మీద టేబుల్ ఫ్యాన్ గిరాగిరా తిరుగుతోంది.

గది మధ్యలో ఇనుపమంచంమీద దోమ తెరలో పడు కుని వున్నాడు ముసలాడు.

అడుగులో అడుగు వేసుకుంటూ బెడ్ దగ్గరికి వెళ్ళి దోమ తెర పైకిలేపాడు.

ముసలాడి ముఖం చూడగానే ఆవేశం పెల్లుబికింది.

పాంట్ జేబులోనుంచి తోలుకవరులోవున్న కైజారు చురుగ్గా లాగాడు.

పిడికిలి బిగించి చెయ్యి పైకి తీసాడు పొడవడానికి.

అంతలో ఒక సందేహం వచ్చింది అక్బర్ కి. కత్తితో పొడవగానే కెవ్వుమని వాడు కేక పెడితే అది ఎవరికైనా విన్పించవచ్చుగదా అని.

నిజమే! లేనిపోని ఆపద కొని తెచ్చుకున్నట్లవుతుంది అనుకున్నాడు.

హేంగర్ కి తగిలించివున్న కోటుతో నోటిని నొక్కి పెట్టి కస్సున దించాడు కైజారు. అది గుండెలో దిగ బడింది. పైకితీసాడు. బుస్సున చిమ్మింది నెత్తురు.

ఎర్రటి నెత్తురు చూడగానే అక్బర్ కి ఆవేశం పదింత

లైంది. పిచ్చెక్కిన వాడిలా అందిన చోటల్లా లెక్క లేనన్ని పోట్లు పొడిచాడు. తెల్లటి బెడ్ ఎర్రగా మారి పోయింది.

'చచ్చాడు ముసలినక్క' అనుకుని ఆ గదిలో తనకు కావల్సినవి తీసుకుని తలుపులు తీసుకుని ఇంటిముందు నుంచే వెళ్ళిపోయాడు.

ప్రహరీగోడ ప్రక్కనే కైజారును పాతిపెట్టాడు.

ఎగిరి గోడ ఎక్కాడు.

చేతిలో బరువైన సంచీ వుంది. అందులో ఆ ముసలాడి టేప్ రికార్డర్, కెమేరా, వాచీ,పర్సు వగైరావున్నాయి.

అయితే, దురదృష్టం అతన్ని వెన్నాడింది.

అతను గోడమీద వుండగా ఆ వీధిలోనే వుంటున్న ఖాదర్ ఆటోలో వస్తూ, అక్బర్ని చూశాడు. అప్పటికి అక్బర్ గోడదిగి రోడ్డుమీదకు వచ్చాడు.

గోడమాకి రోడ్డుమీదకు వచ్చిన అక్బర్ని చూసే సరికి అతనికి అనుమానం వచ్చింది. ఆటో ఆపించి గట్టిగా అరిచాడు "చోర్ ....చోర్ ...." అని.

అక్బర్ వులిక్కిపడి, రోడ్డుదిగి, ఒక సందులోకి పారిపోయాడు.

ఖాదర్ అతన్ని పట్టుకోవాలని వెంటపడ్డాడు గాని అక్బర్ చిక్కలేదు. ఆ సందుల్లో ఎక్కడో మాయ మయ్యాడు.

వుసూరుమంటూ మళ్ళీ రోడ్డుమీదకు వచ్చాడు ఖాదర్. ఆటో డ్రైవర్ తాపిగా బీడీ కాల్చుకుంటూ కన్పించాడు.

ఆటోలో ఖాదర్ భార్య, ఇద్దరు పిల్లలు వున్నారు. అతను రాగానే భార్య చీవాట్లు పెట్టింది. దారినపోయే

గొడవ మనకెందుకు అని.

అక్కడికి అతని ఇల్లు దగ్గరే. చలికాలం కావటంవల్ల అంతా తలుపులు బిగించుకుని పడుకున్నారు. అతని కేకలకు గూడా ఎవరూ లేవలేదు.

ఆటో అతని ఇంటిముందు ఆగింది. డబ్బులు ఇచ్చి పంపించేశాడు.

కాని ఖాదర్ కి ఏంచేయాలోతోచలేదు. తను కళ్ళారా ఒక దొంగనిచూశాడు. ఆ ఇంటి గోడదూకి వస్తుంటే ఆటో డ్రైవర్ గూడా గమనించాడు. వాడి చేతిలోవున్న సంచీలో దొంగసొమ్ము వుండివుంటుంది.

ఇప్పుడేంచెయ్యాలి?

ఆ ఇంట్లో దొంగతనం జరిగిందని పోలీసులకు రిపోర్టు ఇస్తే?

ఆ ఇంట్లో ఎవరో ఒక ముసలాయన వున్నాడు. తనకి పరిచయంలేదు అతనితో.

ఇప్పుడు ఆ ఇంట్లో అతను వున్నాడో లేదో? ఎక్కడికైనా వెళ్ళాడేమో? అది గమనించి ఎవరైనా దొంగతనం చేశారేమో?

2

సీత సిటీబస్ ఆగింది.

ఆమె వెనకనే దిగాడు రాజారెడ్డి.

ఆ స్టాప్ లో వాళ్ళిద్దరే దిగారు.

ఆమె చేతిలో చిన్న బ్యాగ్ మాత్రమేవుంది.

రాజారెడ్డి చేతిలో టిఫిన్ బాక్సువుంది.

సిటీబస్ దుమ్మురేపుకుంటూ వెళ్ళిపోయింది.

రాజారెడ్డి అన్నాడు "ఎక్కడ్నుంచి వస్తున్నావ్?"

"మా వూర్నించి" అంది సీత.

"ఇంత రాత్రి ఒక్కదానివే వస్తున్నావే!"

"చీకటి పడకుండా వచ్చేదాన్నే. బస్సు చెడిపోయింది. అందుకే ఇంత ఆలస్యం."

"వారం నుంచి కన్పించకపోతే ఎక్కడికి వెళ్ళావో అనుకున్నా!" నవ్వుతూ అన్నాడు రాజారెడ్డి.

"ఎక్కడికి వెళ్ళాననుకున్నావ్?" వాలు చూపులు చూస్తూ కొంటెగా అంది సీత.

"అత్తగారింటికి వెళ్ళావేమోనని...."

"ఛీ.... పెళ్ళికాకుండా అత్తగారింటికి ఎట్లా వెళ్తారు?"

"పెళ్ళి ఇక్కడే అవ్వాలని ఏముంది?" అంటూ ఆమెకు దగ్గరగా నడిచి చెయ్యి పట్టుకున్నాడు.

"ఎందుకూ దూరం దూరంగా నడుస్తావ్? కొంచెం దగ్గిరగా నడవరాదూ! చలిగా వుంది కూడాను" అన్నాడు రాజారెడ్డి.

"వదులు....ఎవరైనా చూస్తారు" అంది సీత చేతిని విదిలించుకుంటూ.

రాజారెడ్డి గట్టిగా పట్టుకొని "ఎందుకూ అంత భయం? ఎవరూ చూడరులే...." అన్నాడు ఇంకా దగ్గరగా జరుగుతూ.

"అబ్బబ్బ నీకు.... సిగ్గులేదు" అంది సీత విసుగ్గా.

"అవును. నిజమే. అందుకే కిటికీలోంచి ఫోజులు కొడుతున్నాను" అన్నాడు నవ్వుతూ.

సీతకు సిగ్గు ముంచుకొచ్చింది.

"అది వేరు...." అంది.

కొంచెం దూరం నడిచాక అంతా చిమ్మ చీకటి. స్ట్రీట్ లైట్లు వెలగడంలేదు కనుచూపు మేరలో.

"ఎంత చీకటిగా వుందో!" అంది సీత.

"మనకోసమే...." అంటూ రాజారెడ్డి ఆవేశంతో ఆమెను హత్తుకుని ముద్దు పెట్టుకున్నాడు.

సీతకు క్షణకాలం కాలం స్తంభించిపోయినట్లయింది.

ఆ చలిలో వెచ్చటి రాజారెడ్డి కౌగిలి స్వర్గాన్ని చూపిస్తోంది. అతన్ని రెండు చేతులతో దగ్గరికి లాక్కుంది వంకర్లు తిరిగిపోతూ.

"ఎప్పుడూ ముద్దులేనా?" ఆమె చెవిలో గుసగుస లాడాడు.

"మరేం కావాలి?" గోముగా అంది సీత.

"నీకు తెలీదా?"

"వుహూఁ...."

"ఒకరాత్రి ఏకాంతంగా నీతో గడపాలి."

"అబ్బ, ఎంత ఆశ."

"దురాశ. అవునుగాని....ఇదే ఛాన్సు మళ్ళీ రాదు మనకి. వెనక్కి వెళ్ళిపోదామా?" అన్నాడు రాజారెడ్డి.

"ఎక్కడికి?"

"ఏదైనా హోటల్లో హాయిగా గడిపి తెల్లవారి వచ్చేద్దాం. ఏమంటావ్?"

"అమ్మో! హోటల్లోనా! పోలీసులు పట్టుకుంటారు. వద్దు బాబూ!...." అంది సీత.

రాజారెడ్డికి నిరాశ కలిగింది.

నెమ్మదిగా అతన్ని వదిలించుకుంది సీత.

ఇద్దరూ నెమ్మదిగా నడవసాగారు. ఇద్దరి శరీరాలు దగ్గరగా వున్నాయి. ఒకరి చేతిలో మరొకరి చెయ్యి వెచ్చగా నలిగిపోతోంది.

ఇంటికి చేరుకుంటే విడిపోవాలి. మళ్ళీ ఇలా చేతిలో

చెయ్యి వేసుకుని తిరిగే అదృష్టం దొరకదు. చూపులతోనే సరి. ఎప్పుడో ఒక వేడిముద్దు దొరుకుతుంది. అంతే.

నడుస్తున్న వాడల్లా తక్కున కాళ్ళకు బ్రేకులుపడిన వాడిలా ఆగిపోయాడు రాజారెడ్డి.

"సీతా!...."

"ప్రూఁ...."

"ఈ ఇంట్లో ఒక ముసలాయన వున్నాడు. ఒక్కడే వుంటున్నాడు. మనం ఈ రాత్రికి అతని ఇంట్లో గడిపి ప్రొద్దున్నే వెళ్ళిపోదాం."

"వద్దు...."

"ప్లీజ్...."

"ఎవరికైనా తెలిస్తే!"

"ఎలా తెలుస్తుంది?"

"ఆ ముసలాయన ఎవరికైనా చెప్తే?"

నవ్వాడు రాజారెడ్డి.

"వాడికి తెలుగురాదు. వురదూ గూడా సరిగ్గారాదు.. మనం మాట్లాడుకునేవి వాడికి చచ్చినా అర్థంకాదు" అన్నాడు.

సీత మనసు వెనక్కీ ముందుకీ ఊయల లూగుతోంది. మూడేళ్ళనుంచీ పరిచయం వున్నా చెప్పుకోదగ్గ మధుర క్షణాలు ఏవీలేవు, అప్పుడప్పుడూ ముద్దులు తప్ప. అవకాశం ఆమెను ప్రోత్సహిస్తున్నా అంతరాంతరాల్లో ఏదో భయం కలుగుతోంది.

"పోదాం పద...." చెయ్యిపట్టుకుని లాగాడు.

"ముందు అడిగిరా అతన్ని. మనం వుండటానికి ఒప్పుకుంటాడో లేదో!" అంది సీత.

"సరే నువ్విక్కడే వుండు...." అన్నాడు రాజారెడ్డి.

సీత తల వూపి చింతచెట్టు ప్రక్కన ఒరిగిపోయింది.

రాజారెడ్డి ఇనుపగేటు దూకి వెళ్ళాడు.

"హాసన్ సాబ్ ....హాసన్ సాబ్!" అని నాలుగైదు సార్లు కేకవేశాడు.

లోపలనుంచి సమాధానం రాలేదు.

తలుపుతట్టాడు. కిర్రుమని తెరుచుకుంది.

"హాసన్ సాబ్!...." అంటూ నెమ్మదిగా లోపలకు వెళ్ళాడు.

బెడ్ రూమ్‌లో బెడ్ లైట్ వెలుగుతోంది.

తలుపులు తెరిచే వున్నాయి.

బెడ్ రూమ్‌లో ప్రవేశించిన రాజారెడ్డికి హాసన్ శరీరం నెత్తురు మడుగులో కన్పించింది.

షాక్ తిన్నవాడిలా అదిరిపోయాడు. గుండెలో రైలు పరిగెత్తినట్లు వుక్కిరిబిక్కిరైపోయాడు. కాళ్ళు గడగడా వణికాయి.

పరుగువంటి నడకతో వెనక్కి తిరిగాడు. కాలు క్రింద ఏదో మెత్తగా తగిలింది. ఆగి చేతిలోకి తీసుకున్నాడు. అది కైజారు తోలు కవరు. దాన్ని ముట్టుకునేసరికి అతని శరీరం భయంతో జలదరించింది. పాముని చూసినవాడిలా విసిరికొట్టాడు

ఆ గదిలోనుంచి బైటపడ్డాడు.

సీతతో అనుభవం, సుఖం దేవుడెరుగు ముందీ కొంపలో నుంచి బైటపడే మార్గం చాలు అనుకుంటూ పరుగుతీశాడు.

ఇంట్లోనుంచి బైటపడేసరికి రోడ్డుమీద జీప్ ఆగిన శబ్దం వినిపించింది.

వాళ్ళు పోలీసులని క్షణాలలో గ్రహించాడు.

వాళ్ళు గనుక తనను చూస్తే హాసన్‌ని హత్యచేసింది

తనే అని కేసుపెట్టి వురిశిక్ష వేయిస్తారు.

రాజాగెడ్డికికి భయంతో శరీరం చల్లబడింది. ఒక్క క్షణం చుట్టూ చూశాడు. ఒక్కటే మార్గం కనిపించింది. అదే దొడ్డిదారి.

పోలీసులు ఆ కాంపౌండ్‌లోకి అడుగుపెట్టకముందే దొడ్డి వెనక్కి వెళ్ళి గోడమూకి బైటపడ్డాడు.

అక్కడ రోడ్డుప్రక్కన చెట్టుమొదట్లో నిల్చున్న సీత జీప్ వచ్చి ఆగటంలో కంగారుపడింది. అక్కడ్నుంచి వడివడిగా అడుగులు వేసింది.

ఇన్స్పెక్టర్ చూడనే చూశాడు.

"ఏయ్! ఆగు...." అన్నాడు.

జీప్ హెడ్‌లైట్ల వెలుగులో సీతని నఖశిఖపర్యంతం పరీక్షగా చూస్తున్నారు పోలీసులు.

"ఎవరు నువ్వు?"

సీతకు భయంతో నోటివెంట మాటలు రాలేదు. లైట్ల కాంతి కళ్ళమీదపడి వాళ్ళు మసక మసకగా కనిపిస్తున్నారు.

"మాట్లాడవేం?" గద్దించాడు ఇన్స్పెక్టర్ సుదర్శన్.

"నేను .... నేను .... బస్సుదిగి వస్తున్నాను ...." మాటలు తడబడ్డాయి.

"నేను చూస్తూనే వున్నా! ఈ చెట్టుక్రింద ఆగావు ఎందుకు?"

సీతకు అంత కంగారులోనూ ఒక వుపాయం స్ఫురించింది.

వెంటనే సిగ్గును అభినయిస్తూ చిటికిన వేలు చూపింది.

"ఎవరి అమ్మాయివి నువ్వు?" ప్రశ్నించాడు ఇన్స్పెక్టర్.

"నరసయ్య చెల్లెల్ని!"

"నరసయ్య ఎవరు?"

"మా అన్నయ్య."

"అన్నయ్య సరే ఎక్కడ మీ ఇల్లు."

"లక్ష్మీనగర్ కాలనీలో."

"ఏంచేస్తాడు మీ అన్నయ్య?"

"బిస్కెట్ కంపెనీలో డ్రైవరు."

ఇన్స్పెక్టర్ నోట్ బుక్ తీసి "నీ పేరు?" అన్నాడు.

"సీత."

"మీ అన్నయ్య పేరు నరసయ్య. ఇంటి నెంబరు చెప్పు."

సీత చెప్పింది.

"ఇక వెళ్ళు" అన్నాడు.

'బ్రతుకుజీవుడా' అనుకుంటూ వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయింది సీత.

"మిస్టర్ ఖాదర్!"

"జీ...." అంటూ వచ్చాడు ఖాదర్.

"ఈ ఇల్లేనా?" ప్రశ్నించాడు ఇన్స్పెక్టర్.

"హా సాబ్!...." అని తను ఆటోలో వస్తూ వుండడం, ఎవడో దొంగ గోడదూకి వచ్చాడనీ, వాడి చేతిలో సంచీవుందనీ, తను ఆటో దిగి వాడిని తరుముకెళ్ళాననీ, కానీ వాడు ఆ సందుల్లో ఎక్కడో మాయమయ్యాడనీ ఆ తర్వాత తను పోలీస్ రిపోర్టు ఇచ్చాననీ అంతా చెప్పాడు ఖాదర్.

"ఈ ఇంట్లో ఎవరు వుంటున్నారు?"

"అబ్దుల్లా హాసన్ అని ఒక ముసలాయిన వుంటున్నాడు సాబ్?"

"ఆయన ఇంట్లో లేడా?"

"ఏమో సాబ్! నేను చూళ్ళేదు" అన్నాడు ఖాదర్.

ఇన్స్పెక్టర్ గేటు దగ్గరికి వెళ్ళి చూశాడు. తాళం వేసివుంది.

ఇన్స్పెక్టర్ గేటు ఎక్కి అవతలికి దిగాడు. సిబ్బంది అనుసరించారు. ఖాదర్ గూడా వాళ్ళతోపాటు వెళ్ళాడు.

తలుపులు తీసే వున్నాయి.

బెడ్రూమ్లో సన్నగా వెలుగుతోంది బెడ్లైటు.

ఇన్స్పెక్టర్ బెడ్రూమ్లోకి వెళ్ళగానే తలుపు ప్రక్కన స్విచ్బోర్డు చూసి స్విచ్లన్నీ ఆన్ చేశాడు.

ట్యూబులైటు జిగేలుమని వెలిగింది.

బెడ్ మీద ఎర్రటి నెత్తురులో అబ్దుల్లా హసన్ చచ్చి పడి వున్నాడు.

హసన్ శవాన్ని చూసి ఖాదర్ షాక్ తిన్నాడు.

"ఎవడో హత్య చేసి ఇల్లు దోచుకున్నాడు" అన్నాడు ఇన్స్పెక్టర్ విచారంగా.

3

తెల్లవారుతూనే అబ్దుల్లా హసన్ హత్య చేయబడ్డాడనే వార్త ఆ వీధిలో అందరికీ తెలిసిపోయింది.

ఆ ఇంటిముందు గుంపులు గుంపులుగా జనం నిలబడి మాట్లాడుకుంటున్నారు.

పోలీస్ కమీషనర్ వచ్చి హత్యా ప్రదేశాన్ని సందర్శించాడు. హత్యలు చేసి ఇళ్ళు దోచుకునే పాత నేరస్తులను రప్పించి హంతకుడిని తక్షణం పట్టుకోవలసిందిగా క్రింది అధికారులను ఆదేశించాడు.

వేలి ముద్రల నిపుణుడు కిటికీలమీద, తలుపులమీద పౌడర్ జల్లి వేలిముద్రలకోసం వెతుకుతున్నాడు.

హత్య చేసిన కత్తి దొరకలేదు. కాని దాని తోలు కవరు దొరికింది. దానిమీద వేలిముద్రలు వున్నాయి.

ఎందుకైనా మంచిదని పోలీస్ కుక్కను రప్పించారు. అది శవం వున్న మంచం దగ్గిర వాసనచూసి కాంపౌండు గోడదాటి రోడ్డుమీదకు వెళ్ళింది. ఆ తర్వాత రోడ్డు దిగి ప్రక్క సందులోకి వెళ్ళింది. కొన్ని మెలికలు తిరిగి మెయిన్ రోడ్డు దగ్గర ఒక చెట్టుక్రింద ఆగింది. కదల కుండా అక్కడే కూలబడింది.

అంటే హంతకుడు అక్కడ్నుంచీ ఏదో వాహనం మీద వెళ్ళిపోయాడన్నమాట.

శవపంచాయితీ జరిగిన తర్వాత శవాన్ని పోస్ట్మార్టమ్ కోసం హాస్పటల్ కి తరలించారు.

హతుడి గదిలో రెండు సూట్ కేసులు మాత్రం దొరికాయి. ఒక సూట్ కేస్ తెరిస్తే అందులో బట్టలు మాత్రమే వున్నాయి. రెండోదాంట్లో అన్నీ కాగితాలు. అందులో పనికివచ్చేవి పెద్దగా లేవు. మూడు నెలల క్రితం నగరంలో హోటల్ రెడ్ లాండ్ లో నెలరోజులపాటు వున్నందుకు లాడ్జింగ్ బిల్లు, మరొకటి బోర్డింగ్ బిల్లు వున్నాయి.

తర్వాత అంతకు క్రితం రోజు పోస్టలు ముద్రతో ఒక కవరువుంది. అది సౌదీ అరేబియానుంచి వచ్చింది. ఆ కవరులో ఒక లెటర్ వుంది. ఆ భాష వురుదూకాదు. బహుశా అరబ్బీ అయివుంటుందని ఇనస్పెక్టర్ అను కున్నాడు. ఆ లెటర్ తో ఏదో ముఖ్యమైన పత్రం పిన్ చేసి వున్నట్లు ఎడమవైపు గుర్తులున్నాయి. కాని ఆ పత్రం లేదు దానికి. బహుశా బ్యాంక్ డ్రాఫ్టుకావచ్చు.

అదే సూట్ కేస్ లో రెండు ఫారిన్ బ్యాంకుల ప్యాస్

బుక్‌లు కనిపించాయి. ఒక బ్యాంక్‌లో నాలుగువేలు చిల్లర. మరొక బ్యాంక్‌లో పదిహేను వందలు బ్యాలన్సు వుంది.

ఎఫ్. ఐ. ఆర్. పూర్తి చేసి పంపిన తర్వాత హంతకుడి గురించి ఆలోచించసాగాడు ఇనస్పెక్టర్ సుదర్శన్.

అబ్దుల్లా హాసన్ ఈ దేశస్థుడు కాదు. షుమారు మూడు నెలల క్రితం ఈ దేశం వచ్చాడు. అతనికి ఈ మూడు నెలలలో విరోధులు ఏర్పడ్డానికి పెద్దగా అవకాశం లేదు. పోతే అతని దగ్గర బాగా డబ్బు, సామాను వుందని తెలిసి, ఒంటరిగా వుంటున్నాడని బాగా తెలిసిన వ్యక్తి ఈ ఘాతుకం చేసివుండొచ్చు.

నిన్ననే వచ్చిన లెటర్ చదివితే ఇంకా వివరాలు బాగా తెలుస్తాయి అనుకున్నాడు.

పోలీస్ స్టేషన్‌కి ఫర్లాంగ్ దూరంలో ఒక మసీదు వుంది. అందులోవుండే కాజీకి అరబ్బీవచ్చు. పిల్లలకు అరబ్బీభాష నేర్పుతూ వుంటాడు. అతనితో ఈ లెటర్ చదివిస్తే సరిపోతుంది అనుకున్నాడు ఇనస్పెక్టర్.

ఇనస్పెక్టర్ వెళ్ళేసరికి కాజీ గడ్డం నిమురుకుంటూ మసీదులోనే వున్నాడు.

ఇనస్పెక్టర్ని చూసి ముందు తెల్లముఖం వేశాడు. ఇనస్పెక్టర్ సలాం చేశాక తేరుకుని "ఆప్ బైఠియే! క్యా హోనా?" అని ప్రశ్నించాడు.

ఇనస్పెక్టర్ తను వచ్చినపని చెప్పి ఆ అరబ్బీలెటర్ యిచ్చి చదివి అందులో సారాంశం చెప్పమన్నాడు.

కాజీ ఆ లెటర్ చదివి చెప్పాడు.

అది అబ్దుల్లాహసన్ కొడుకు రాశాడు. ఇప్పటికే దేశం వదిలి ఆర్నెల్లు గడిచిందనీ, ఈలోగా చాలాడబ్బు ఖర్చు

చేశావనీ మందలిస్తూ రాశాడు. ఇండియాలో ఎవర్నయినా పెళ్ళిచేసుకున్నా అక్కడే దాన్ని వదిలించుకుని రమ్మన్నాడు. అంతేగాని, వెంటబెట్టుకుని రావద్దు అని గట్టిగా రాశాడు.

తర్వాత బిజినెస్ గురించి రాశాడు. అనుకోకుండా అక్కడ పెద్దప్రమాదం జరిగి చాలానష్టం కలిగిందట. రిగ్గుతో ఆయిల్ కోసం తవ్వకం సాగిస్తున్నారట. దాదాపు వందమంది రిగ్గువద్ద పనిచేస్తున్నారట. అకస్మాత్తుగా ఆయిల్, హైడ్రోజన్ సల్ఫయిడ్ గ్యాస్ పైకి పొంగిందట. వెంటనే ప్రేలుడు సంభవించిందట. 20 మంది అక్కడికక్కడే చనిపోయారట. ఏభై మందికి గాయాలు తగిలి హాస్పటల్లో జేర్చాడట.

తను సమయానికి అదృష్టవశాత్తు లేడట. అల్లాదయ వల్ల క్షేమంగా వున్నాడట. అక్కడ వుండివుంటే చచ్చిపోయివుండేవాడట. ఇప్పుడు చనిపోయినవారికి నష్టపరిహారం, గాయపడిన వారికి ట్రీట్ మెంట్ కోసం చాలా డబ్బు ఖర్చయిపోయిందట.

అందుకని తను పదివేలుమాత్రమే పంపగలుగుతున్నాననీ, ఇదే ఆఖరుసారి అని గమనించి వెంటనే బయల్దేరి రమ్మని రాశాడు.

అందులో చెక్ నంబరు, బ్యాంక్ పేరు వగైరా రాశాడు.

ఇన్ స్పెక్టర్ అవన్నీ డైరీలో నోట్ చేసుకుని కాజీకి సలాములు చెప్పి స్టేషన్ కి వచ్చాడు.

అయితే హసన్ ఆ చెక్ క్యాష్ గా మార్చుకుని వచ్చాడా? ఆ క్యాష్ ఎక్కడుంది? హత్య చేసినవాడు దొంగిలించాడా? హసన్ బ్యాంక్ నుంచి క్యాష్ తెచ్చి

నట్లు ఎవరైనా గమనించారా?

ఇన్స్పెక్టర్ పాత నేరసుల జాబితా పరిశీలిస్తూ కూర్చున్నాడు. మోడ్ ఆఫ్ థెఫ్ట్ పద్ధతిలో చూస్తే అటువంటి నేరాలు చేసేవాళ్ళు నగరంలో పదిమంది వరకూ వున్నారు. కాని వాళ్ళంతా పట్టుబడి నేరం రుజువై జైల్లోనే శిక్ష అనుభవిస్తున్నారు.

అయితే నగరానికి ఎవరైనా కొత్తవాడు వచ్చి వుండాలి.

4

ఇన్స్పెక్టర్ సుదర్శన్ హోటల్ రెడ్‌లాండ్‌కి ఫోన్ చేశాడు.

"హోటల్ రెడ్‌లాండ్ ప్లీజ్...."

"ఎవరు మాట్లాడుతున్నారు?"

"రిసిప్షనిస్టుని."

"ఇన్స్పెక్టర్ సుదర్శన్ మాట్లాడుతున్నాను. మీ మేనేజర్ గారు వున్నారా?"

"వున్నారు. పిలవమంటారా?"

"యస్. పోలీస్ ఇన్స్పెక్టర్ సుదర్శన్ మాట్లాడుతున్నానని చెప్పండి."

"అలాగే లైన్లో వుండండి."

కాసేపటికి మేనేజర్ మాట్లాడాడు. "నమస్తే! ఇన్స్పెక్టర్ సాబ్!"

"నమస్తే!....నమస్తే!"

"రూమ్స్ ఏమైనా కావాలా?"

"నో....నో....అదేం కాదు. ఒక మర్డర్ కేసు గురించి వివరాలు కావాలి."

"మర్డర్ కేసా?....మా హోటల్లో అటువంటిదేమీ

జరగలేదే!" మేనేజర్ కంఠంలో కంగారు వినిపించింది.

"మర్డర్ కేసు మీ హోటల్లో జరగలేదు లెండి. హతుడు కొన్నాళ్ళు మీ హోటల్లో వున్నాడు. ఆ వివరాలు కావాలి."

"ఎవరు?"

"చెప్తాను. అతను రూమ్ నెంబర్ 103లో వున్నాడు. మూడు నెలల క్రితం. పేరు అబ్దుల్లా హాసన్. సౌదీ అరేబియా దేశీసుడు."

"ఆఁ....జ్ఞాపకం వచ్చిందిలెండి. అతను హత్యచేయబడ్డాడా?"

"అవును....ఎవరో అతన్ని బెడ్‌రూమ్‌లో హత్యచేసి సామాను, డబ్బు దోచుకు పోయారు. ఎంతపోయిందో? ఏమేమి పోయాయో ఇంకా తెలియదు. అతనికి ఇండియాలో ఎవరైనా బంధువులున్నారో ఏమో తెలియదు. మర్డర్ జరిగినట్లు అతని కొడుక్కి మెసేజ్ పంపించాం."

"అలాగే! పాపం. మా హోటల్లో బాగానే వుండేది. కాని డబ్బు ఖర్చయిపోతున్నదని వేరే ఎక్కడో ఇల్లు తీసుకుని వుంటున్నాడు."

"అదే! అతన్ని గురించి ఏమైనా చెప్తారా మీరు. అంటే అతన్ని హత్యచేయడానికి ఎవరైనా శత్రువులు వున్నారేమోనని."

"అతనికి శత్రువులు వున్నారో లేదో నాకు తెలియదు ఇన్స్పెక్టర్ సాబ్! కాని మా హోటల్లో వుండగా ముంతాజ్ బేగం అనే పిల్లను పెళ్ళిచేసుకున్నాడు. పాపం ఆ పిల్లకు నిండా పదిహేనేళ్ళు లేవు. ఈ హాసన్‌కేమో అరవై ఏళ్లు దాటిపోయాయి. ఆ పిల్ల తల్లిదండ్రులు బాగా బీదవాళ్ళు. వెయ్యి రూపాయలకు ఆశపడి పిల్లగొంతు

కోశారు.

కాని ఏం లాభం? ఆ ముసిలాడు పదిహేను రోజుల పాటు ఆ పిల్లతో గడిపాడు. చీకటిపడగానే ఆ పిల్లని హోటల్ కి తీసుకొచ్చి వదిలిపోయేది తల్లి. తెల్లవారగానే తీసుకెళ్ళిపోయేది. నాకు చాలా జాలికలిగేది వాళ్ళని చూస్తూ వుంటే! కాని మనం చేసేది ఏమీ లేదు.

ఆ ముసలాడు పదిహేను రోజులు గడిచాక ఆ పిల్ల నాకు వద్దు పొమ్మన్నాడు. తలాక్ అన్నాడు. ఏదో మళ్ళీ కొంత డబ్బు మొఖానకొట్టాడు ఆ పిల్ల తల్లి దండ్రుల మొఖాన."

"ఆ తర్వాత మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడా?"

"తెలియదు. చేసుకునే వుంటాడు."

"అతని గురించి ఇంకా ఏమైనా చెప్తారా?"

"నాకు ఏం తెలుస్తుంది? రూమ్ ఖాళీ చేసి పోయాడు. ఆ తర్వాత అతన్ని గురించి ఏమీ తెలియదు" అన్నాడు మేనేజర్.

ఇన్స్పెక్టర్ రిసీవర్ పెట్టేశాడు.

తలెత్తి చూసేసరికి మఫ్టీలోవున్న హెడ్ కానిస్టేబుల్ చంద్రయ్య సెల్యూట్ చేశాడు.

"లక్ష్మీనగర్ కాలనీలో తిరిగివచ్చాను సార్!" అన్నాడు.

"ఏమిటి సంగతి?"

"సీత గురించి కనుక్కున్నాను. ఆ అమ్మాయి అన్న దగ్గిర వుంది. కుట్టుమిషన్ నేర్చుకుంటోందట."

"అంతేనా?"

"ఆ అమ్మాయి రాజాగౌడ్ అనే అతనితో రాత్రి బస్ స్టాప్ దగ్గిర గుసగుసలాడుతోంది."

"ఏం మాట్లాడుకున్నారో విన్నావా?"

"లేదు సార్! నేను దగ్గరకి వెళ్ళగానే మాట్లాడ్డం మానుకున్నారు. బస్సు కోసం వెయిట్ చేస్తున్నట్లు నటిస్తూ చాలాసేపు మాట్లాడుకున్నారు. పెద్దగా నవ్వుకున్నారు కూడా!"

"ఏదైనా లౌ ఎఫైర్ ఏమో!"

"ఏమో సార్!"

"అతను ఏం చేస్తున్నాడట."

"ఏదో కంపెనీలో పనిచేస్తున్నాడట."

"అతన్ని పట్టుకురా ఒకసారి!"

హెడ్ అలాగే నిల్చుండిపోయాడు.

"హత్య జరిగినచోట ఇద్దరి వేలిముద్రలు దొరికాయి. ఎందుకు పోనివ్వాలి? ఈ కుర్రాడివి ఏవైనా దొరుకుతాయేమో చూద్దాం."

హెడ్ ఒక అరగంటలో తిరిగివచ్చాడు. దురదృష్టవశాత్తు రాజారెడ్డి ఇంట్లోనే వున్నాడు. పోలీస్ జీప్ ఆగగానే అతని పైప్రాణాలు పైనే పోయాయి. కాని తప్పదుగదా! లేకపోతే వీధిలో పెద్దగొడవ జరుగుతుంది. అందుకే మాట్లాడకుండా వచ్చాడు.

"నువ్వేనా రాజారెడ్డి?"

తలవూపాడు భయంగా.

రాజారెడ్డి ముఖంలో కన్పించే భయచిహ్నాలు, తత్తర పాటు గమనిస్తే హత్యలో అతనికి భాగం వుందేమో అనిపించింది.

"అబ్దుల్లా హసన్ నీకు తెలుసా?"

లేదన్నట్లు తల అడ్డంగా తిప్పాడు.

"తెలియకపోతే అతని ఇంట్లోకి ఎందుకు వెళ్ళావ్?"

గద్దించాడు ఇన్‌స్పెక్టర్.

రాజా రెడ్డి కొయ్యబారిపోయాడు. అయితే తను గోడ దూకి పారిపోవడం పోలీసులు చూశారన్నమాట అను కున్నాడు. అలా అనుకోగానే తను వుచ్చులో చిక్కు కున్నాడని తెలిసిపోయింది. అతని ధైర్యం సడలిపోయి ఏడుపు ముంచుకొచ్చింది.

"నాకేం తెలియదుసార్! నేను వెళ్ళేసరికే అతను చచ్చి పడివున్నాడు. నాకు భయం వేసింది. ఇంట్లోంచి వచ్చేసరికి రోడ్డుమీద జీప్ ఆగివుంది. నేను వెనకగోడ దూకి పారిపోయాను." వణుకుతున్న స్వరంతో చెప్పాడు రాజా రెడ్డి.

"అసలా ఇంట్లోకి ఎందుకు వెళ్ళావ్?"

రాజా రెడ్డి దాపరికం లేకుండా అంతా నిజం చెప్పాడు.

"దేవుడి సాక్షిగా అంతా నిజం సార్!"

"అయితే ఆ అమ్మాయిని పిలిచి అడగమంటావా?"

"వద్దుసార్! ఆ అమ్మాయి పరువుపోతుంది. పెద్ద వాళ్ళకి తెలిస్తే మమ్మల్ని బ్రతకనివ్వరు. దయచేసి ఆ అమ్మాయిని ఇందులోకి లాగకండి." అన్నాడు రాజా రెడ్డి ఏడుపు ఆపుకుంటూ.

రాజరెడ్డి స్టేట్ మెంట్ తీసుకుని సంతకం పెట్టించాడు. అతని వేలిముద్రలు తీసుకుని లాకప్‌లో వుంచాడు.

తర్వాత ఖాదర్‌ని పిలిపించి రాజా రెడ్డిని చూపించాడు.

కాని ఖాదర్, రాజా రెడ్డిని చూసి అతను తనుచూసిన మనిషి కాదని నిర్ధారించాడు. తను చూసిన వ్యక్తికి చిన్న గడ్డం వుందని ఖచ్చితంగా చెప్పాడు.

రాజా రెడ్డి నిర్దోషి అని చెప్పగలిగేది అతని వేలి

ముద్రలే. కాని రాజారెడ్డి వేలిముద్రలు, హతుడి గదిలో దొరికిన వేలిముద్రలతో సరిపోయాయి. అబ్దుల్లాహసన్‌ని ఇద్దరు కలిసి చంపివుండవచ్చును. అందులో ఒకడు రాజారెడ్డి. మరొకడు ఎవరు? ఇన్‌స్పెక్టర్ తీవ్రంగా ఆలోచించసాగాడు.

5

"ఫారిన్ బ్యాంక్ మేనేజర్ కావాలి." అన్నాడు ఇన్‌స్పెక్టర్ సుదర్శన్.

"ఎవరుసార్ మీరు?"

"పోలీస్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్."

"జస్ట్ఏ మినిట్." అని "ప్లీజ్ మాట్లాడండి." అంది ఒక సన్నని కంఠం.

"విఠల్‌రావ్ స్పీకింగ్ ప్లీజ్!"

"మేనేజర్ గారా?"

"యస్! వాటీజ్ యువర్ గుడ్ నేమ్ ప్లీజ్."

"సుదర్శన్, పోలీస్ ఇన్‌స్పెక్టర్."

"ప్లీజ్ టెల్ మీ! వాట్ కెన్ ఐడూ ఫర్ యూ?"

"చిన్న ఇన్ఫర్మేషన్ కావాలి సార్!"

"అడగండి."

"అబ్దుల్లాహసన్, ఎకౌంట్ నెంబర్ 9436. అతను హత్య చేయబడ్డాడు సార్!"

"ఎక్కడ?"

"అతని ఇంట్లోనే." అంటూ వివరంగా చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

"అతనికి సౌదీ అరేబియానుంచి పదివేలకు ఒక చెక్ వచ్చింది. అది క్యాష్ చేసుకున్నాడా లేదా? చూసి చెప్పండి." అంటూ చెక్ నెంబర్ చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

కాసేపటి తర్వాత మేనేజర్ మాట్లాడాడు.

"ఇన్‌స్పెక్టర్! మీరు పొరబడ్డారు. ఎక్కౌంట్ నెంబర్ 9986 అబ్దుల్లాహాసన్ మీరు చెప్పిన చెక్ క్యాష్ చేసుకోలేదు. కాని, ఎక్కౌంట్ నెంబర్ 9983 అబ్దుల్లా హాసన్ చెక్ ఎక్కౌంట్లో వేసుకున్నాడు."

"ఏమిటి మీర నేదిః 9983 ఎక్కౌంట్ నెంబర్‌తో మరొక అబ్దుల్లాహాసన్ వున్నాడా?"

"అవును. మీరు చెప్పిన చెక్ నిన్ననే ఎక్కౌంట్లో వేశాడు."

"మేనేజర్! అతను దొంగ. ఎక్కౌంట్ ఎప్పుడు ఓపెన్ చేశాడు చెప్పండి?"

"నిన్ననే ఓపెన్ చేశాడు. చెక్ కూడా నిన్ననే వేశాడు."

"సార్! అతను ఖచ్చితంగా దొంగే. అతను అబ్దుల్లా హాసన్ కాదు. ఆ పేరుతో ఎక్కౌంట్ పెట్టాడు. ఆ చెక్ అబ్దుల్లాహాసన్‌కి అతని కొడుకు పంపించాడు. దాని తాలూకు లెటర్ సూట్‌కేస్‌లో వుంది."

"ఏమిటిసార్ మీరు చెప్పేది?"

"నిజమే! ఒకవేళ అబ్దుల్లాహాసన్ పేరుతో క్యాష్ చేసుకోవడానికి ఎవరైనా వస్తే మాకు ఫోన్ చేసి చెప్పండి. అంతవరకూ అతన్ని అక్కడే వుంచండి. బహుశా హాసన్‌ని మర్డర్ చేసిన వాడు అతనే కావచ్చు."

"ఓ మైగాడ్! వాడు మమ్మల్నే మోసం చేశాడన్న మాట."

"అతను ఎవరో తెలియకుండా ఎక్కౌంట్ ఎలా పెట్టారు?"

"తను ఫారినర్‌ననీ తనకి సిటీలో ఎవరూ తెలియదని

బాంకాడు. అందులో పదివేలకు డ్రాఫ్టు తెచ్చాడుగదా ఎలా అనుమానించగలం చెప్పండి."

"నిజమే అనుకోండి. కాని అతని అడ్రస్ లేకుండా ఎకౌంట్ ఎలా పెట్టనిచ్చారు?"

"అడ్రస్ ఎందుకివ్వలేదు. ఇచ్చాడు. రూమ్ నెంబర్ సెవంటీ, హోటల్ గెస్‌లాండ్."

"మీకు నిజం తెలియాలంటే ఆ హోటల్‌కి ఫోన్ చేసి అడగండి. ఆ రూమ్‌లో వేరే ఎవరో వుండి వుంటారు." అన్నాడు ఇన్ స్పెక్టర్.

"అలాగే తెలుసుకుంటాను. థాంక్స్ ఇన్ స్పెక్టర్."

"నో మెక్షన్. మీరు కాస్త ఎలర్ట్‌గా వుండండి. అతను వస్తే నాకు ఫోన్ చేసి చెప్పండి. నా ఫోన్ నెంబర్ నోట్ చేసుకోండి." అంటూ నెంబర్ చెప్పాడు ఇన్ స్పెక్టర్.

ఇన్ స్పెక్టర్‌కి ఫారిన్ బ్యాంక్ మేనేజర్ చెప్పిన విషయం చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. హంతకుడు గుండెలు తీసిన మొనగాడే! లేకపోతే తనకు దొరికిన వస్తువులతోను, డబ్బుతోను సంతృప్తిపడక, దొరికన చెక్ గూడా మార్చుకోవాలని ప్లాన్ వేశాడు. అసాధ్యుడులా వున్నాడే! వీడికీ రాజారెడ్డికీ ఏదైనా అండర్‌స్టాండింగ్ వుందా?

ఆలోచిస్తూ కూర్చున్నాడు ఇన్ స్పెక్టర్.

అరగంట తర్వాత ఇన్ స్పెక్టర్ ముందున్న ఫోన్ మ్రోగింది.

"పోలీస్ స్టేషన్ ప్లీజ్!"

"ఇన్ స్పెక్టర్ సుదర్శన్ వున్నాడా?"

"యస్. సుదర్శన్నే మాట్లాడుతున్నాను."

"అబ్దుల్లాహసన్ అనేవాడు వచ్చాడు. చెక్ కౌంటర్లో

ఇచ్చాడు పదివేలకు. క్యాష్ ఇవ్వకుండా కూర్చోబెట్టాం. ఇప్పుడు ఇక్కడే వున్నాడు. వెంటనే ఎవర్నయినా పంపించండి."

"ఎవరో ఎందుకు నేనే స్వయంగా వస్తున్నాను వాడిని అరెస్ట్ చేయడానికి." అన్నాడు ఇన్‌స్పెక్టర్ సుదర్శన్.

6

అచ్చం అరేబియా దేశస్థుడిలా వేషం వేసుకున్నవాడిని ఫారిన్ బ్యాంకులో అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు.

వంటిమీద దెబ్బపడీ పడకముందే, "నిజం చెప్తాను బాబో!" అన్నాడు కేకలు పెడుతూ.

"ఎవరు నువ్వు నిజం చెప్పు?"

"నా పేరు అక్బర్."

"ఏం పని చేస్తావు?"

"హోటల్ రెడ్‌లాండ్ ప్రక్కన కిళ్ళీకొట్టు పెట్టుకున్నాను." అన్నాడు.

అరబ్బీ వేషం తీసి పడేశాక నిజరూపం బైటపడింది అక్బర్‌ది.

అతని చిన్నగడ్డం చూడగానే ఖాదర్ మాటలు జ్ఞాపకం వచ్చాయి. వాడేవీడు. లేకపోతే చెక్ ఎలావస్తుంది?

"చెప్పు అబ్దుల్లాహసన్‌ని ఎందుకు హత్య చేశావు?"

"వాడు నాకు ఇవ్వవలసిన డబ్బు ఇవ్వకుండా మొండి చెయ్యి చూపించాడు. పైగా నన్ను తిట్టాడు. డబ్బు ఇవ్వను నీఇష్టం వచ్చింది చేసుకో అన్నాడు. నా డబ్బు రాబట్టుకోవడానికి ఖూనీ చేశాను." అని తను నేరం చేసి నట్లు ఒప్పుకున్నాడు అక్బర్.

"అతను మన దేశంవాడు కాదుగదా? నీకు డబ్బు ఎందుకు బాకీ వున్నాడు?"

"వాడికి నేను రెండు పెళ్ళిళ్ళు కుదిర్చాను. ఇద్దరికీ విడాకులు ఇచ్చాడు. మొదటి పెళ్ళి కుదిర్చినప్పుడు నా కమీషన్ ఇచ్చాడు. విడాకులు ఇచ్చినప్పుడు ఇవ్వలేదు. రెండోసారి పెళ్ళికుదిర్చినప్పుడు కమీషన్ ఇవ్వలేదు. పైగా ఆ పిల్లకు విడాకులు ఇచ్చాడు. డబ్బు అడిగితే కసిరి కొట్టాడు. బద్మాష్!" అంటూ తిట్టాడు అక్బర్.

కేసు తొందరగా తేలిపోయినందుకు సంతోషించాడు ఇన్‌స్పెక్టర్ సుదర్శన్. హంతకుడు నేరం ఒప్పుకున్నాడు. రెండో మనిషి వేలి ముద్రలు అక్బర్‌వే అని తేలింది. రాజాగౌడ్ నిర్దోషి. అతను చెప్పిన కథంతా నిజమే!

కేస్ తయారుచేసి అక్బర్ నేరం ఒప్పుకున్నట్లుగా తెలియజేయడానికి కమీషనర్‌ని కలిశాడు ఇన్‌స్పెక్టర్ సుదర్శన్.

పోలీస్ కమీషనర్ కేసు అంతా చూసి, ఇన్‌స్పెక్టర్ వంక ఎగాదిగా చూశాడు.

"పోస్ట్‌మార్టమ్ రిపోర్టు చదివావా?" ప్రశ్నించాడు సీరియస్‌గా.

"యస్సార్!" అన్నాడు.

"మరొకసారి చదివి కేసు పెట్టు. లేకపోతే మనం వెర్రి ముఖాలు వేసుకుని నిల్చోవాలి కోర్టులో." మందలించాడు.

ఇన్‌స్పెక్టర్‌కి ముచ్చెమటలు పోశాయి. పోస్ట్‌మార్టమ్ రిపోర్టు చదివాడో, లేదో జ్ఞాపకం రాలేదు.

తీరా చూస్తే ఏముంది? అబ్దుల్లా హాసన్ కత్తిపోట్ల వల్ల మరణించలేదు. విషం ప్రయోగించడంవల్ల మరణించాడు. అతను రాత్రి పది పదిన్నర మధ్య చనిపోయి

వుంటాడు.

అక్బర్ యిచ్చిన స్టేట్ మెంట్ యిప్పుడు పనికిరాదు. కోర్టులో కేసు కొట్టేస్తారు. పోలీసులు వత్తిడిచేయడం వల్ల అక్బర్ నేరం వొప్పుకున్నాడని అతని తరఫు లాయర్ వాదిస్తాడు. అక్బర్ వెళ్ళేసరికే అబ్దుల్లాహాసన్ మరణించాడని బల్ల గుద్దడానికి యిప్పుడు అవకాశం వచ్చింది.

అక్బర్ అతన్ని చంపదల్చుకున్నాడు. కత్తితో పొడిచాడు. కాని అతను పొడిచింది అంతకుముందే విష ప్రయోగం వలన మరణించిన హాసన్ ని. శవాన్ని పొడిచినందుకు శిక్ష లేదు. అక్బర్ నేరస్థుడు కాదు. అబ్దుల్లా హాసన్ పేరుతో బ్యాంక్ ఎక్కౌంట్ తెరిచి చెక్ మార్చుకోవటానికి ప్రయత్నించడం అది వేరే కేసు.

ఇనస్పెక్టర్ కి నీరసం ముంచుకొచ్చింది అవన్నీ ఆలోచించే కొలదీ. పోలీస్ కమీషనర్ ఫేవర్ కోసం వెళ్తే చీవాట్లు దొరికాయి.

ఆలోచిస్తూ స్టేషన్ చేరుకున్నాడు ఇనస్పెక్టర్.

వచ్చీరాగానే అబ్దుల్లాహాసన్ పెళ్ళిళ్ళు చేసుకుని విడాకులు యిచ్చిన భార్యల తాలూకు అడ్రస్ లు నోట్ చేసుకున్నాడు అక్బర్ ద్వారా!

ఇనస్పెక్టర్ సుదర్శన్ అబ్దుల్లా హాసన్ యింటికి మరొకసారి వెళ్ళి అన్ని కోణాలనుంచీ పరిశీలించాడు. ఈసారి తాళం వేసివున్న కిచెన్ రూమ్ తెరిపించాడు. అందులో వంటచేసిన హంగామా ఏమీ లేదు.

స్టెయిన్ లెస్ స్టీల్ క్యారియర్ అస్తవ్యస్తంగా పడి వుంది. దాంట్లో మిగిలిన ఆహార పదార్థాలు చెడు వాసన కొడుతున్నాయి.

డైనింగ్ టేబుల్ మీద రెండు పాలగ్లాసులు కనిపించాయి. పాలు పోసిన గుర్తుగా కరెంటు హీటరు, దాని మీద ఒక గిన్నె కనిపించాయి. గోడ బీరువాలో టీ పొట్లాం, డబ్బాలో పంచదార వగైరా ఆహారపదార్థాలు వున్నాయి.

టిఫిన్ కారియర్, పాలు పోసివున్న గ్లాసులుమీద వేలిముద్రలు వచ్చాయి. ఆ తరువాత వాటిని పరిశోధనకు పంపించాడు ఆహారపదార్థాలలో విషం యేదయినా కలిపి వుందేమో తెలియజేయమని.

అక్బర్ తను చేసిన నేరం వొప్పుకున్నప్పటికీ పోస్టు మార్టమ్ రిపోర్టు, కెమికల్ ఎగ్జామినర్ రిపోర్టు అందుకు విరుద్ధంగా వుండటం వలన కేసు పెట్టడానికి వీలులేకుండా పోయింది. అక్బరే విషం యిచ్చి చంపాడని చెప్పడం అసందర్భంగా వుంటుంది. విషం యిచ్చి చంపినవాడు కత్తితో పొడవడం యెక్కడా జరగదు.

అక్బర్ మేనమామ బెయిల్ మీద అతన్ని విడిపించుకుని పోయాడు.

కేసు యెక్కడ వేసిన గొంగళి అక్కడే వున్నట్లుగా మళ్ళీ మొదటికే వచ్చి కూర్చుంది.

7

"ఆ పాలగ్లాసులమీద వచ్చిన వేలిముద్రలు యిద్దరివి వున్నాయి. అబ్దుల్లా హసన్‌వి. మరొకరు ఆడమనిషి" అన్నాడు వేలిముద్రల నిపుణుడు.

ఇనస్పెక్టర్ అనుమానం ధృవపడింది. అతన్ని అక్బర్ కంటే ముందు అతను విడాకులు యిచ్చిన భార్యల్లో ఒకరు విషం యిచ్చి చంపి వుండొచ్చు. అదంతా పది గంటల లోపు జరిగింది.

అక్బర్ కి అతను విషప్రయోగంతో చచ్చాడని తెలియక కత్తితో పొడిచి కసి తీర్చుకున్నాడు. చేతికి దొరికిన సామాను ఎత్తుకొనిపోయాడు. కాబట్టి అతను హంతకుడు కాదు. దొంగ మాత్రమే.

అబ్దుల్లాహసన్ నగరానికి వచ్చిన మొదట్లో పెళ్ళి చేసుకున్న అమ్మాయి ముంతాజ్ బేగం. ఆమె తండ్రి నాలుగు చక్రాల బండీమీద పళ్ళు అమ్ముకుంటూ జీవిస్తున్నాడు. అతని పేరు అహమ్మద్ ఖాన్.

అతనికి ముంతాజ్ బేగం మూడో అమ్మాయి. ఇద్దరు అమ్మాయిలకు యెలాగో పెళ్ళిళ్ళు చేసి పంపేశాడు. ఇంకా ఒక ఆడపిల్ల, ఆ తర్వాత ముగ్గురు మగపిల్లలు వున్నారు. చాలీచాలని సంపాదనతో తిండి తినడమే గగనమై పోతున్నది.

మూడో పిల్లకు పెళ్ళి యెలా చెయ్యాలా అని ఆలోచిస్తూ వుండగా అక్బర్ పెళ్ళి సంబంధం తీసుకొచ్చాడు. అరబ్బీవాడు అయితేనేం డబ్బున్నవాడు, ముసలివాడు అయితేనేం పిల్ల సుఖపడుతుంది. డబ్బు వెనకేసుకుంటే ఆ ముసలాడు పోయాక మరొకడ్ని చేసుకోవచ్చు. ఈ రోజుల్లో డబ్బు వుంటే చాలు యెవడోకడు పెళ్ళి చేసుకోవడానికి ముందుకొస్తాడని అక్బర్ వూదరకొట్టాడు.

అహమ్మద్ ఖాన్ భార్యగూడా యిష్టంలేకపోయినా గత్యంతరం లేక పిల్లకు పెళ్ళయితే చాలని ఒప్పుకొంది. ఆ అరబ్బీవాడు పెళ్ళి ఖర్చులు పెట్టుకొని వెయ్యిరూపాయలు యిచ్చాడు. అందులో రెండు వందలు అక్బర్ తన కమీషన్ అని తీసుకున్నాడు.

పదిహేను రోజులు రోజూ కూతుర్ని రాత్రిళ్ళు హోటల్ కి తీసుకెళ్ళి అల్లుడి దగ్గర వదిలి వచ్చేది తల్లి.

మళ్ళీ తెల్లవారిన తర్వాత తీసుకొచ్చేది.

ఒకరోజు నాకీ భార్య వద్దని పేచీ పెట్టాడు అరబ్బీవాడు. విడాకులకు సిద్ధమయ్యాడు. కారణం ఏమిటంటే సరిగా చెప్పడు. సరిగా సంసారం చెయ్యడం లేదంటాడు. పిల్ల పుష్టిగా లేదంటాడు. వంట్లో అన్నీ యెముకలే అంటాడు. పిల్ల నల్లగా వుందంటాడు. యిష్టంలేని మొగుడు పెరుగులో రాళ్ళొచ్చాయని చితకబాదినట్లుంది అతని వరుస.

ఇష్టంలేనప్పుడు బ్రతిమాలి యేం లాభమని అహమ్మద్ ఖాన్ నోరు మూసుకొని వూరుకొన్నాడు. అరబ్బీవాడు యిచ్చిన డబ్బు తీసుకున్నాడు.

అదంతా చెప్పి కళ్ళల్లో నీళ్ళు నింపుకున్నాడు అహమ్మద్ ఖాన్.

ఇనస్పెక్టర్‌కి అతన్ని చూసి జాలి కలిగింది.

అతని భార్య మాత్రం అరబ్బీవాడిని తెగ తిట్టింది. వాడు చచ్చాడని తెలిసి సంతోషించింది. ముంతాజ్ బేగం అమాయకంగా అదంతా వింటూ కూర్చుంది.

"ఎవరో అతనికి విషం యిచ్చి చంపేశారు. విషం పాలల్లో కలిపి యిచ్చారు. ఆ గ్లాసుమీద ఒక ఆడమనిషి వేలిముద్రలు దొరికాయి. ఎవరివో తెలుసుకున్న దాకా నేను అందర్నీ అనుమానించాల్సిందే!" అన్నాడు ఇన్స్పెక్టర్.

అహమ్మద్ ఖాన్ భార్యవి, అతని కూతురు వేలిముద్రలు తీసుకున్నాడు ఇనస్పెక్టర్. అవసరమయితే మళ్ళీ కలుస్తానని వెళ్ళిపోయాడు.

అబ్దుల్లాహసన్ ముంతాజ్ బేగం తర్వాత పెళ్ళిచేసుకొన్న అమ్మాయి పేరు అమీనా!

ఆ అమ్మాయికి తండ్రి లేడు. తల్లి పనిపాటలు చేస్తూ కూతుర్ని బ్రతికిస్తోంది. ఇంకా యిద్దరు ఆడపిల్లలు, ఒక మగపిల్లవాడు వున్నాడు ఆమెకు. మిగతా కథంతా అలాగే వుంది దాదాపు.

అమీనా తల్లిగూడా అరబ్బీవాడు చచ్చాడని విని సంతోషించింది.

వేలిముద్రలు తీసుకొన్నాక "ఇప్పుడు అనిపిస్తోంది బాబూ! నేనే వాడిని చంపివుంటే నా కసి తీరేదని. ఎవరోగాని బాగా చేశారు" అంది ఆమె.

తను కలెక్టు చేసిన వేలిముద్రలు నిపుణుడికి పంపించాడు.

కాని ఫలితం మాత్రం శూన్యం.

విషపు గ్లాసుమీద దొరికిన వేలిముద్రలతో ఎవరివీ టాలీ కాలేదు.

8

హోటల్ రెడ్‌లాండ్‌లో 103 వ నెంబర్ గదిలో ఒక అరబ్బీ దిగాడు. అతని పేరు మహమ్మద్. రూమ్‌లో దిగిన వెంటనే పెళ్ళి పెళ్ళి అనసాగాడు. రూమ్ బాయ్ కిళ్ళీకొట్టు అక్బర్‌కి కబురు చేశాడు.

అక్బర్ మహమ్మద్‌ని కలుసుకున్నాడు. మహమ్మద్ మరీ ముసలివాడు కాడు. నలభై ఏళ్ళకు కొంచెం అటూ యిటూ వుంటుంది వయస్సు. కొంచెం నలుపు. లావుగా వున్నాడు. ఉర్దూ బాగా మాట్లాడాడు.

అక్బర్‌ని ఇంపోర్టెడ్ సిగార్ లైటర్ ప్రెజెంట్ చేశాడు. తనకు నచ్చినపిల్ల దొరికితే వెయ్యి రూపాయలు నజ్రానా ఇస్తానని ప్రామిస్ చేశాడు.

వెయ్యి అనగానే యెగిరి గంతేశాడు అక్బర్. కిళ్ళీ కొట్లో తన తమ్ముడిని కూర్చోబెట్టి, అరబ్బీని వెంటేసు

కుని పెళ్ళికావలసిన అమ్మాయిల యిళ్ళకు తిరగసాగాడు.

దాదాపు పాతికమంది కన్నెపిల్లల్ని చూపించాడు అక్బర్. కాని అందులో ఎవరూ అరబ్బీకి నచ్చలేదు. ప్రతి అమ్మాయిలోనూ ఏదోక సాకు వెతికేవాడు. అక్బర్ కి విసుగుపుట్టింది అతని ప్రవర్తన.

'వీడికి నచ్చేపిల్ల లోకంలో యింకా పుట్టలేదు' అనే నిర్ణయానికి వచ్చాడు అక్బర్.

అందుకే మహమ్మద్ తో తిరగడం మానేశాడు.

కాని మహమ్మద్ వూరుకోలేదు. అక్బర్ ని పిలిపించాడు.

"ఏమిటి యింకా ఎవరూ దొరకలేదా?" అన్నాడు.

"ఇక నా వల్లకాదు" అన్నాడు అక్బర్ విసుగ్గా.

"అలా అంటే ఎలా భాయ్! నాకో సంగతి తెలిసింది చెప్పనా?"

"ఏమిటి?"

"అబ్దుల్లా హసన్ ఈ వూళ్ళో రెండు పెళ్ళిళ్ళు చేసుకుని విడాకులు ఇచ్చాడు. మూడో పెళ్ళి కుదిరిందని తెలిసింది. ఆమె చాలా బాగుంటుందట. నీకు తెలుసా?"

"తెలుసుకుంటాను. కాని వాడికి ఆ పిల్లను నేను మాట్లాడలేదు. సయ్యద్ మాట్లాడాడు."

"ఆఁ....అదీ—నువ్వు సయ్యద్ ద్వారా మాట్లాడు. పిల్ల నాకు నచ్చితే చెరోక ఐదొందలు యిస్తాను. ఏం?" అన్నాడు మహమ్మద్.

"అలాగే!" అని ఆ పనిమీద వెళ్ళిపోయాడు అక్బర్.

మర్నాడు ఆ అమ్మాయి తల్లిదండ్రులు వచ్చి మహమ్మద్ తో మాట్లాడారు. పిల్ల నచ్చితే రెండువేలు ఇస్తాననీ, పెళ్ళిచేసుకున్న వెంటనే భార్యను తమదేశం తీసు

కెళ్ళిపోతానని చెప్పాడు మహమ్మద్. తను అబ్దుల్లా హసన్‌లా మోసం చెయ్యనని ప్రామిస్ చేశాడు.

ఆ సాయంకాలమే పెళ్ళిచూపులుజరిగాయి హోటల్లో.

ఆ అమ్మాయి పేరు రజియా! వయస్సు ఇరవై పైనే వుంటుంది. ఎత్తుగా, పుష్టిగా వుంది. పసిమి రంగుతో మిస మిసలాడుతున్న రజియాను చూస్తూనే "అచ్ఛా...." అంటూ లొట్టలు వేశాడు అరబ్బీ.

తనకు కాబోయే అత్త మామలకు, భార్యకు హోటల్లో నుంచి ఫలహారాలు, టీ తెప్పించి బాగా మర్యాద చేశాడు.

అమ్మాయి తనకు నచ్చిందని చెప్పాడు.

అరబ్బీవాడు నీకు నచ్చాడా, లేదా అని ఆమెను ఎవరూ అడగలేదు. అవసరం లేదేమో మరి?

మంచిరోజు చూసి నిక్కా ఏర్పాటు చేస్తానని రజియా తల్లిదండ్రులు పిల్లను తీసుకుని వెళ్ళిపోయారు.

9

సాయంకాలం ఆరు దాటింది.

అప్పుడే చీకటి పడుతోంది.

హోటల్ రెడ్‌లాండ్ అప్‌స్టెయిర్ ఎక్కి రూమ్ నంబర్ 103 ముందు ఆగి బెల్ కొట్టింది బురఖాలో వున్న అమ్మాయి.

వెంటనే తలుపులు తెరుచుకున్నాయి.

ఆమె లోపలకు వెళ్ళి వెంటనే తలుపు మూసి బోల్టు పెట్టేసింది.

బురఖా తీసి హేంగర్‌కి తగిలించి నవ్వింది.

"నాకు తెలుసు నువ్వు వస్తావని!" నవ్వుతూ అన్నాడు మహమ్మద్.

ఆమె బిత్తరపోయింది ముందు. తర్వాత తేరుకుని "ఈ

రోజు మీతో ఇక్కడే(విందు తీసుకోవాలని వచ్చా" అంది.

"అలాగే! నువ్వు నోరు తెరిచి అడిగితే కాదంటానా?" అన్నాడు.

"తల నొప్పిగా వుంది. చాయ్ తెప్పించండి" అంది ఆమె.

అతను బెల్ నొక్కాడు తలుపు తీసి.

ఆమె బాత్ రూంలోకి వెళ్ళింది.

బాయ్ టీ తెచ్చి వెళ్ళాక వచ్చింది.

తలుపు బోల్టు పెట్టింది.

టీ కప్పు చేతిలోకి తీసుకుని, "ఇంత వేడిగా వుందే మిటి?" అంది.

అతను నవ్వాడు "నీలాగే" అన్నాడు.

ఆమె సిగ్గు పడింది.

"తీసుకోండి...." అంటూ టీకప్పు అతనికి అందించింది.

అతను ఆమె చేతిని సుతారంగా పట్టుకొని "ముందు నువ్వు తీసుకో. పాపం తల నొప్పిగా వుందన్నావు గదా" అంటూ ఆ కప్పుని ఆమె పెదవుల దగ్గరికి తీసుకెళ్ళాడు.

ఆమె ముఖం భయంతో కంపించింది.

"వూ.... త్రాగు...." అన్నాడు.

ఆమె పెదవులు బిగబట్టింది.

"నాకు తెలుసు నువ్వా టీ త్రాగవు, అందులో విషం కలిపావు కాబట్టి" అన్నాడు గట్టిగా.

ఆమె ముఖం పాలిపోయింది.

"నీకు పెళ్ళి చేసుకోవడం ఇష్టంలేదు. కాని నీ తండ్రి బలవంతంగా అరబ్బీ వాడికైనా సరే ఇచ్చి పెళ్ళిచేసి భారం వదిలించుకోవాలని చూస్తున్నాడు. అబ్దుల్లా హాసన్ మీద నీకు అసహ్యం. అతనితో కాపురం ఘోరం

అని తలిచావు. పెళ్ళి కుదరగానే అతని ఇంటికి వెళ్ళి మాటలు చెప్పి, పాలలో విషం కలిపి చంపావు కదూ!" అన్నాడు.

ఆమెకు ఏడుపు వచ్చింది, తన సంగతి బైటపడిపోయినందుకు.

అతను అరబ్బీవేషం వూడదీసి పారేశాడు.

"చూడు, నేను అరబ్బీవాడిని కాదు. సి.ఐ.డీని. నీ కోసమే ఈ అవతారం ఎత్తాను. నిన్న నువ్వు టీ త్రాగిన గ్లాసుమీద వేలిముద్రలు, ఆ రోజు హాసన్ ఇంట్లో నువ్వు పాలలో విషం కలిపిన గ్లాసుమీది వేలిముద్రలూ సరిపోయాయి. నా ప్లాన్ సక్సెస్ అయ్యింది" అన్నాడు అతను.

రజియా నిలువునా కూలిపోయింది.

అరబ్బీ ముసలివాడితో మనసులేని కాపురం చెయ్యడానికి భయపడి....ఆ భయంతో సాహసించి అతన్ని మట్టుపెట్టింది.

ఆమె పాలిట మరొక అరబ్బీ తయారయ్యాడు.

వీడినీ చంపాలనుకుంది.

కాని రోజులన్నీ ఒకలా వుండవు.

అందుకే పట్టుబడిపోయింది.

రజియా వున్నట్లుండి బురఖా వేసుకుని, గదిలోనుంచి పారిపోవాలని ప్రయత్నించింది.

కాని అతను ఆమెను పట్టుకుని "నువ్విక పారిపోలేవు!" అన్నాడు.

"వాడితో పెళ్ళికంటే నాకు చావే నయం" ఏడుస్తూ ఆవేదనా స్వరంతో అంది రజియా.

—:ఐపోయింది:—